# అంతేనా?

"సాగర"

●

అమీర్ అని మాత్రం పేరు. పుట్టి దానికి తగ్గ హోదా నేమీ అందించకుండానే ఈలోకాన్నించి దాటారు అమీర్ తల్లితండ్రులు. అమీర్ చిన్నతనప్పురోజులు చాలా గడ్డుగా గడిచాయి. తన చేతికందిన ఒక్క పైసనిగూడా ఆట్టేకాలం నిలుపుకోలేక పోయాడు. చాలారోజులు కూలీ తట్టమోసి... మోయించుకున్న వాళ్లు కసిరికసిరి బేరంచేసి దయాధర్మంగా ఇచ్చిన అణాలు కాన్లతోనే ఏదో విధంగా తన జీవయాత్రకు తెరచాపయెత్తేవాడు. కాని ఈకట్టు మోసిన డబ్బుతో రానురాను చాలా దుర్భరమైంది ఆతడి జీవితం గడపటానికి. అంచేత దానికి స్వస్తిచెప్పి కొన్నాళ్లు ఓకంపెనీలో బోయ్‌గా పనిచేశాడు. కాని మాయదారి ఖర్మం. అందులో జరిగిన దొంగతనం అమీర్ మీదపడి... అన్యాయంగా... ఎలాగైతే నేం ప్రాణాలు దక్కించుకుని బయటపడ్డాడు.

ఇలాగ తన జీవితం ఎగుడుదిగుడుల్లో వుండగానే అతనివంతు ఈసారి 'చీటీ' కట్టిన డబ్బుతో శల్యావశిష్టంగావున్న ఓరిక్షాకొన్నాడు. మిత్రులు దాని అవతారం చూసివద్దన్నారుగాని... తను సంపాయించబోయే డబ్బుతో దాన్ని బాగుచేయిస్తానని తీయని కలలుకన్నాడు.

రిక్షాలాగటం జీవనంగా పెట్టుకొన్న తర్వాత అతను పడేకష్టానికి ఇదివరకటికన్నా ఎక్కువ డబ్బు సంపాదించినా—నీరసం ఆకలిగూడా ఎక్కువ కావటంవల్ల సరిగ్గా తిండికే సరిపోయేది.

గంగానమ్మ నెత్తిమీద శివాలాడ్తున్నన్నాళ్లూ అదృష్టరేఖ ఆదరిచేరటానికి సాహసించలేదు. అమీర్ ప్రస్తుతం ఆ అవస్థలోనే ఉన్నాడు. తోటి రిక్షావాళ్లు తమ రిక్షాలను చక్కగా మరమ్మతు చేయించి రంగులేసి ఎంతో ఆకర్షణగావుంచేవారు. కాని అమీర్ సంపాయించేది మిగలక పోవటంచేత తను ఏస్థితిలో రిక్షాకొన్నాడో నేడూ అదే స్థితిలోవుంది.

టాపు అక్కడక్కడ తూట్లుపడి కూర్చున్న వాళ్ల నెత్తిన ఎండపడుతుంది. చక్రాలలో నూనెలేక నడుస్తుంటే కిరకిరలాడుతూ చప్పుడు. ఈస్థితిలో వున్న అమీర్ రిక్షామీద చూస్తూచూస్తూ... అందులో ప్రక్కన చక్కని రిక్షాలు కనిపిస్తుంటే— ఎవరెక్కుతారు? ఎక్కిగాని తక్కువ బేరానికి మాట్లాడేవారు. అతని నిజస్థితి గురించి ఎవరిక్కావాలి? తెల్సుగోవల్సిన అవసరం ఏముంది? తెల్సిన ఏ నాబోటివాడున్నాగాని మాట సాయంగా సానుభూతి తెల్పగలను గాని—ఆఫీసరు కొరకొర చూపులూ, తిట్ల తుపానులో అతి జాగ్రత్తగా నాజీవితనావకు తెడ్డువేస్తున్న నేను డబ్బుసహాయం చేయగలగటం కల్ల. అప్పటికీ నాకవసరమైనప్పుడల్లా అమీర్ రిక్షామీదనే పోతూవుండేవాణ్ని. బేరమాడకుండా అతనికి బాడుగముట్టజెప్పేవాణ్ని. అంతకే అతని కళ్లు నాకు ధన్యవాదాలర్పిస్తాయి.

ఒకనాడతని రిక్షాలోపోతూ అడిగాను 'ఎలావుంది నీజీవితం?' అని.

అదోవిరక్తిగా నవ్వి "ఏం చెప్పమన్నారు బాబూ నాగతి! రిక్షా సరిగ్గా లేకపోవటంతో ఎవ్వరూ ఎక్కరు. దాంతో సంపాదన సన్నగిల్లుతోంది. తిండికే జరగకుండా వుంటె రిక్షానెట్ల బాగుచేయించను? జనం ఎక్కటం తగ్గటంతో నాతిండికే లోటుతెచ్చి సంపాదనైపోయింది. దాంతో అర్ధాకలి నీరసంతోనే రిక్షాలాగవాణ్ని. పైనున్న అయ్యలు 'తొరగా పోరా వెధవా' అంటూ కోప్పడేవారు ...ఒక్కో మారాజు తన్నేవాడు నాగతిలేనిజీవితం కోసం వాటన్నటినీ వోర్చేవాణ్ని. కాని బాబు

గారూ! రానురాను ఓపిక సన్నగిల్లుతోంది. ఇంక ఈమాత్రంగుడా లాగలేనేమో! ఏమిటో పంతులుగారూ నాకు బ్రతుకు మీదే విరక్తిపుడుతోంది.'' వింటూన్నంతసేపు నాగుండె తరిగిపోయింది. నెత్తురు వుడికింది. నా అసహాయతకి ఏడ్చాను. చేతిలో వున్న రెండురూపాయలనోటు వద్దంటున్నా అమీరు చేతిలో పెట్టాను. మాకా నాటికి యింటికి తేవల్సిన వెచ్చాలు బంద్.

* * *

ఎందుకనో వారం రోజుల్నుంచి అమీర్ కనపడటంలేదు. నాకు అనుమానంతోచి అతని గుడిశవైపుకు వెళ్లాను. నాగుండె జల్లుమన్నది. గుడిశ ఖాళీ. ప్రక్కన దీనస్థితిలో రిక్షాపడివున్నది. దానిమీద నిశ్చింతగా ఒకకుక్క నిద్రపోతోంది. ప్రక్క వాళ్ళనడిగాను. 'ఏమో బాబూ వారమైంది కనపడి' అన్నారు. నాకు అకస్మాత్తుగా కన్నీరు జారింది. అప్రయత్నంగా అన్నాను 'అభాగ్యుడు' అని. ఆ తర్వాత ఆరిక్షా యింటికి తెప్పించాను. మాదొడ్లోనే ఓమూలగా పడివుంది. వానకు తడుస్తూ ఎండకు ఎండుతూ—తనయజమానికోసం నిరీక్షిస్తూవుంది. అమీరేమైపోయాడో అతీగతీలేదు. ఇక ఆ అభాగ్య జీవి గతి అంతేనా?

త్వరలో! అద్భుత హాస్య శృంగార చిత్రము!!

మాడరన్ థియేటర్స్‌వారి సాంఘిక విమర్శ

'చిత్ర'

(తమిళం)

తారాగణం:
K. L. V. వసంత
బాలయ్య
లీల
స్వామినాథన్



★ హాస్యము ★ శృంగారము ★ ప్రఖ్యాత తారలు ★

*Disiributors For Andhra Ceded, Nizams North India & Bombay Presidency:*

**CHAMRIA TALKIE DISTRIBUTORS**

MADRAS :: BEZWADA :: GUNTAKAL :: SECUNDERABAD